13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

ఈ ఏడాది డిసెంబర్ 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్. శ్రీలక్ష్మి సూచించారు. గురువారం స్థానిక న్యాయ సేవాధికార కార్యాలయంలో వివిధ చిట్‌ఫండ్ సంస్థల ప్రతినిధులు, ఆయా సంస్థలకు సంబంధించిన న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిసెంబర్ 13వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులను పరిష్కరించి, బాధితులకు త్వరిత న్యాయం, పరిహారం అందించేందుకు చర్యలు వేగవంతం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న చిట్‌ఫండ్ సంస్థల సివిల్, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులను గుర్తించి, వాటి జాబితాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలని తెలిపారు. అలాగే రాజీ పడతగిన ఇతర కేసులను గుర్తించి, పరస్పర అంగీకార పద్ధతిలో పరిష్కారం దిశగా న్యాయవాదులు కృషి చేయాలని తెలిపారు.

మురుగు పారదు... పూడిక తీయరు

- అధ్వాన్నంగా డ్రెయినేజీల నిర్వహణ
- చిన్నపాటి వర్షాలకే ముంపు

కంబాల చెరువు నుంచి క్వారీ మార్కెట్ రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలోని నగరాల్లో వర్షాలు కురిసిన ప్రతిసారీ మురుగు కాల్వలు పొంగి పొర్లుతున్నాయి. తరచూ పల్లపు ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. కాలువలలో పూర్తి స్థాయిలో పూడిక తీయకపోవటంతో ముంపు తీవ్రత వేధిస్తోంది. ఏటా వీటి కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తారు. ఆయా స్థానిక సంస్థలలో సిబ్బంది కొరత కారణంగా ఈ పనులు జరగటం లేదు. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో 50 వార్డులున్నాయి. సుమారు 4.5 లక్షల జనాభా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రతి రోజూ లిక్విడ్ వేస్ట్ 60 ఎంఎల్‌డి విడుదలవుతోంది. రాజమహేంద్రవరంలో 469 కి.మీ సైడ్‌కాల్వలు ఉన్నాయి. అదేవిధంగా నిడదవోలు పట్టణంలో 40.39 కి.మీ సైడు కాల్వలు ఉన్నాయి. కొవ్వూరులో 70.00 కి.మీ సైడ్ కాల్వలు ఉన్నాయి. అయితే ఈ మురుగునీరు పారేందుకు ఏర్పాటు చేసిన డ్రెయిన్లు ప్రస్తుత అవసరాలకు తగ్గట్లుగా లేకపోవటంతో వర్షం కురిసిన ప్రతిసారీ ప్రధాన వీధుల్లో సైతం మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. చిన్నపాటి చినుకు పడితే చాలు నగరంలోని అనేక వార్డుల్లో రోడ్లపై ప్రవహిస్తున్న నీరు చెరువులను తలపిస్తోంది. రోడ్ల వెంబడి గుంతలు, వర్షపు నీరు ప్రవహించేందుకు మురికి కాలువలు లేకపోవడంతో వర్షపు నీరు నిలిచి రోడ్లవెంట ప్రయణించాలంటేనే ప్రజలు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. చిన్నపాటి వర్షాలు కురుస్తేనే రోడ్ల వెంట ఉన్న గుంతల్లో నీరు చేరి మడుగులు కడుతున్నాయి. ప్రధాన రహదారులతో పాటు లోతట్టు ప్రాంతాలు, మురికివాడలు, శివారు కాలనీల్లో మాత్రం ఈ సమస్య తీవ్రంగా ఏర్పడుతోంది. నగరంలో కంబాల చెరువు వద్ద పేరుకుపోయిన మట్టిని, చెత్తను పూరి స్థాయిలో తీయకపోవడంతో మురుగు నీరంతా రోడ్లపై పారుతోంది. పేపర్ మిల్లు మొదలుకొని ఆర్యాపురం వరకు చిన్నపాటి వర్షాలకి రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. లలిత నగర్ హుకుంపేట, బాలాజీ నగర్, తదితర ప్రాంతాల్లోనూ మురుగునీరు దాటికి తీవ్ర దుర్గంధం, ఈగలు, దోమలతో ప్రజలు అవస్థలు పడుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు కనీస చొరవ చూపించడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో రెండేళ్లలో గోదావరి పుష్కరాలు రానున్నాయి. పెరుగుతున్న రద్దీ తగినట్లుగా రహదారులు లేకపోవడం, డివైడర్లు ఏర్పాటు చేయడంతో బస్ కాంప్లెక్స్ ఏరియా, ఎవి అప్పారావు రోడ్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రధాన వీధుల్లో ఒకటైన శ్యామల నగర్, స్టేడియం రోడ్డు ప్రధాన రైల్వే స్టేషన్ ఏరియా, బస్ కాంప్లెక్స్, కంబాల చెరువు, లలిత నగర్లలో మురికి కాల్వల ఆధునీకరణకు నోచుకోవడం లేదు. ఈ ప్రాంతాలలో దశాబ్దాల క్రితం నిర్మించిన కాలువలు ఉన్నాయి. నగరంలో పెరిగిన జనసాంద్రత అనుగుణంగా అభివృద్ధి చేయాల్సి ఉంది. ఇప్పటికైనా పాలనా యంత్రాంగం దృష్టి సారించి నగరంలో ముంపు సమస్యను పరిష్కరించాలని ప్రజలు, వర్తకులు, ప్రజాసంఘాలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పుష్కరాల నిర్వాహణపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి

పుష్కరాల విజయవంతానికి సమన్వయం అవసరం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

2027లో నిర్వహించే గోదావరి పుష్కరాలు విజయవంతం కావాలంటే అన్ని ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అవసరమని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో గోదావరి పుష్కరాలు -2027 నేపథ్యంలో ప్రాథమిక సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి సమక్షంలో గోదావరి పుష్కరాలు-2027 కార్యాచరణ ప్రణాళిక అందచేసే క్రమంలో జిల్లా ఇన్‌ఛార్ మంత్రి, ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో సూచనలు, సలహాలను అధికారులు చేసిన ప్రతిపాదనలతో సమన్వయం చేసుకోవలసి ఉందన్నారు. ఇందుకు సంబంధించిన సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. గత పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని యాత్రికులు, రవాణా సౌకర్యాలు, భద్రత, శానిటేషన్, నీటి సరఫరా, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై విభాగాల వారీగా చర్చించడం జరిగిందని తెలిపారు. గత పుష్కరాల సమయంలో చేపట్టిన కార్యక్రమాలపై రెవెన్యూ, పోలీసు, ట్రాన్స్‌పోర్ట్, ఆర్‌టిసి తదితర శాఖల అధికారులు తమ విభాగాల ప్రాథమిక కార్యాచరణ, బాధ్యతలు, మరియు అవసరమైన మౌలిక సదుపాయాల వివరాలను పిపిటి ద్వారా సమగ్రంగా వివరించారు. రానున్న సమావేశాల్లో ఇరిగేషన్, దేవాదాయ, రైల్వే, రవాణా, విద్యుత్, మునిసిపల్ శాఖలు 2003, 2015 పుష్కరాల అనుభవాలను ఆధారంగా తీసుకుని తమ విభాగాల డేటా, ఎదుర్కొన్న సవాళ్లు, భవిష్యత్ ప్రణాళికలు సమర్పించవలసి ఉందన్నారు. 2027 పుష్కరాల నిర్వహణలో స్మార్ట్ మానిటరింగ్, ఐసిసిసి ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్, ఎ1 టెక్నాలజీ, డిజిటల్ ఇన్వెంటరీ సిస్టమ్ వంటి ఆధునిక పద్ధతులు కీలకమని అన్నారు. కొవ్వూరు, రాజమహేంద్రవరం ఇరు ప్రాంతాల్లో పుష్కర స్నానాలు ఆచరించే క్రమంలో యాత్రికుల సంఖ్యను ముందస్తుగా అంచనా వేయాలని స్పష్టం చేశారు. తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక వైభవం, సంప్రదాయ విధానాలు, గోదావరి పుష్కరాలకు సంబంధించిన విశిష్ట ఆచారాలు, చారిత్రక నేపథ్యం వంటి అంశాలను సమగ్రంగా ప్రతిబింబించేలా దేవాదాయ, సాంస్కృతిక శాఖలు ఏర్పాట్లు చేయాలని, అమేరకు ప్రతిపాదనలను సంబంధిత విభాగాల అధికారులను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎస్‌పి డి.నరసింహకిషోర్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలకు భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, జన సమూహాల పర్యవేక్షణ వంటి అంశాలపై ముందస్తు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రధాన ఘాట్ల వద్ద సిసిటివి కెమెరాలు, ఎ1 ఆధారిత డెన్సిటీ ట్రాకింగ్ సిస్టమ్, డ్రోన్ పర్యవేక్షణ, స్మార్ట్ పేట్రోలింగ్ పాయింట్లు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ బృందాలు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కెపిఎంజి కన్సల్టెన్సీ ఏజెన్సీ ప్రతినిధులు ప్రకాశ్ శ్రీవాత్సవ్, ప్రశాంత్ తదితరులు మహా కుంభమేళా - 2025 (ప్రయాగ్‌రాజ్)లో అమలు చేసిన స్మార్ట్ క్రౌడ్ మేనేజ్‌మెంట్, వాహన చలనం, పార్కింగ్, శానిటేషన్, డిజిటల్ కమ్యూనికేషన్, ఐసిసిసి ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థల అమలు విధానాలను వివరించారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా టెక్నికల్ లేఅవుట్ మరియు మోడల్ ప్రణాళిక అందించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ వై.మేఘాస్వరూప్, మునిసిపల్ కమిషనర్ రాహుల్ మీనా, అదనపు ఎస్‌పి మురళీకృష్ణ, ఆర్‌డిఒలు రాణిసుస్మిత, కృష్ణనాయక్, డిఎస్‌పి దేవకుమార్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు వాదాలకుంట విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని వాదాలకుంట జడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన 14 మంది విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం విజయ్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేవరపల్లిలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల విద్యార్థులకు క్రీడ పోటీలు నిర్వహించారని, ఈ పోటీల్లో అండర్ 14, 17 రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు 13 మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. సెపక్ తక్రా జాతీయ స్థాయికి ఆశ్రిత ఎంపికైనట్లు వివరించారు. రాష్ట్ర జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు ఆశ్రిత, అక్షర, అశ్రీత, మృదుల, మధుకర్, అజయ్‌కుమార్, ప్రణతి, గీతిక, మధునిష, సోహిత్, రితిక, అఖిల్, దక్షిత, వ్యాయామ ఉపాధ్యాయులు ఓంఫణిలను హెచ్‌ఎంతోపాటు, ఉపాధ్యాయులు జగదీష్, సురేష్, ఎంఇఒలు జి. శ్రీనివాసరావు, ఎ.మహేశ్వరరావు అభినందించారు.

రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

15న మోడల్ కెరీర్ సెంటర్‌లో జాబ్ మేళా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజమండ్రి అర్బన్ నియోజకవర్గంలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో 15వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.హరీష్‌చంద్రప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి విడిజి.మురళీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో రాజేంద్ర ఎనర్జీ పవర్ సొల్యూషన్, వారాహి పవర్ సొల్యూషన్ తదితర సంస్థలలోని పలు ఖాళీలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారని తెలిపారు. 10వ తరగతి నుంచి డిగ్రీ పూర్తిచేసిన, అనుభవం ఉన్న లేదా ఆసక్తి గల 19 నుంచ 40 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని వివరించారు. సోమవారం ఉదయం 10 గంటలకు చేరుకోవాలని సూచించారు.

గోపిమూర్తికి స్వాగతం పలుకుతున్న అధ్యాపకులు

నన్నయ యూనివర్శిటీ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - రాజానగరం

నన్నయ యూనివర్శిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంఎల్‌సి బొర్రా గోపిమూర్తి అన్నారు. గురువారం యూనివర్శిటీ విసి ఎస్.ప్రసన్నశ్రీని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇసి హాల్లో అధ్యాపకులతో సమావేశం జరిగింది. తొలుత అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా విజయం సాధించడంలో నన్నయ యూనివర్శిటీ అధ్యాపక బృందం పాత్ర ఎంతో ఉందన్నారు. తన విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయ బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విద్యా, పరిశోధనలు, విద్యాలయాల అభివృద్ధిలో తనవంతు కృషి చేస్తానని చెప్పారు. విద్యాసంస్థల్లో పని చేస్తున్న ఉపాధ్యాయ, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి వాటిని పరిష్కరిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సిని రిజిస్ట్రార్ కె.వి.స్వామి, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక పురోగతిపై పట్టు సాధించాలి

ప్రజాశక్తి - రాజానగరం

సాంకేతిక పురోగతిపై యువతరం పట్టు సాధించడం ద్వారా చక్కని ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని నన్నయ యూనివర్శిటీ విసి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. గురువారం యూనివర్శిటీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో 'రీసెంట్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ మోడరన్ ఎనలిటికల్ టెక్నాలజీ' అనే అంశంపై ఒక రోజు వర్క్ షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశ్లేషణాత్మక పరికరాలు, రోగ నిర్ధారణ, జీవ శాస్త్రాలు, పర్యావరణ పర్యవేక్షణలో ఆవిష్కరణలకు యుఎస్‌ఎలోని పెర్కిన్ ఎల్మెర్ సంస్థ ప్రసిద్ధి చెందిందని అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో శాస్త్రీయ పరిశోధన, విశ్లేషణాత్మక ఆవిష్కరణల పురోగతికి పెర్కిన్‌ఎల్మర్ చేసిన సహకారాన్ని అభినందించారు. ఆ సంస్థ అత్యాధునిక సాధనాలు, సాంకేతికతలు లెక్కలేనన్ని పరిశోధకులను రసాయన, జీవ మరియు పర్యావరణ శాస్త్రాలలో రాణించడానికి శక్తివంతం చేస్తాయని చెప్పారు. ఈ విద్యా-పరిశ్రమ సహకారం ద్వారా విశ్వవిద్యాలయం శాస్త్రీయ శిక్షణను బలోపేతం చేయడానికి, అంతర్ విభాగ పరిశోధనలను ప్రోత్సహించడానికి దోహదం చేస్తుందన్నారు. పెర్కిన్‌ఎల్మెర్‌తో కలిసి సామాజిక పురోగతి కోసం విద్య, పరిశోధనల ఆవిష్కరణ, స్థిరత్వం, శ్రేష్ఠత యొక్క సంస్కృతిని నిర్మించాలని ఆకాంక్షించారు. పెర్కిన్ ఎల్మెర్ రిజినల్ సేల్స్ మేనేజర్ అచ్యుతరావు.ఆర్ మాట్లాడుతూ 1937లో స్థాపించబడిన పెర్కిన్‌ఎల్మెర్ సంస్థ ఎనిమిది దశాబ్దాలకు పైగా శాస్త్రీయ ఆవిష్కరణ మరియు సాంకేతిక నైపుణ్యాన్ని అభివృద్ధి చేస్తుందన్నారు. స్పెక్ట్రోస్కోపీ, క్రోమాటోగ్రఫీ, థర్మల్ అనాలిసిస్, మాలిక్యులర్ బయాలజీలో అత్యాధునిక పరిష్కారాలను అందిస్తుందని తెలిపారు. అనంతరం అతిథులను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కన్వీనర్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఆచార్య బి. జగన్మోహన్ రెడ్డి, అప్లికేషన్ అండ్ ప్రొడెక్ట్ సైంటిస్ట్స్ డాక్టర్ రవీంద్ర మల్లవరపు, రోహన్ శశికాంత్.ఎన్, డాక్టర్ ఆకాష్‌కుమార్ సాహు, సతీష్ రావూరి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

వర్క్‌షాపులో మాట్లాడుతున్న యూనివర్శిటీ విసి ప్రసన్నశ్రీ

డిఎస్‌సి -2000 బ్యాచ్ రజతోత్సవం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

డిఎస్‌సి-2000 బ్యాచ్ ఉపాధ్యాయులు రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం నెహ్రూ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జి.ఆశాకిరణ్‌కు ఆ బ్యాచ్ ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ 2000 సంవత్సరంలో నవంబర్ 13వ తేదీన ఉద్యోగంలో జాయిన్ అయ్యామని, నేటికి 25 ఏళ్లు పూర్తియిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జాన్సన్, వెంకటేశ్వరరావు, సూర్యశ్రీ, కన్నమనాయుడు, రోజారమణి, పివి.సత్యనారాయణ, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఐక్యతరీని చూపిస్తున్న ఉపాధ్యాయులు

ఐక్యతతో ముందుకు సాగాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

విశ్రాంత ఉద్యోగులంతా ఐక్యతతో ముందుకు సాగాలని ఎపిఎస్‌జిఆర్‌ఎ రాష్ట్ర అధ్యక్షులు శాస్త్రి పిలుపునిచ్చారు. గురువారం ధవళేశ్వరం పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న హక్కులను గత వైసిపి ప్రభుత్వం కాల రాసిందని అన్నారు. ముఖ్యంగా తాత్కాలిక వృత్తి కంటే ఫిట్‌మెంట్ తగ్గించడం, క్వాంటంలో కోత, మరణించిన విశ్రాంతి ఉద్యోగం ఇచ్చే మట్టి ఖర్చుల్లో కోత పెట్టి నరకయాతన పెట్టిందని విమర్శించారు. పెన్షనర్ల సమస్యలపై ప్రస్తుత ముఖ్యమంత్రితో జరిగిన చర్యలు సామరస్యపూర్వకంగా జరిగాయని తెలిపారు. ఒక డిఎ ఇవ్వడం, వచ్చే ఏప్రిల్ కొత్త బడ్జెట్లో అంచెలంచెలుగా మీ సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ సమస్యలన్నీ సమైక్యంగా ఉంటేనే సాధించుకోగలమని అన్నారు. జిల్లా అధ్యక్షులు పల్లా సత్యనారాయణ మూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి బండి సూర్య ప్రకాశరావు, ఎర్రమోతు ధర్మరాజు, డిఎజె.ప్రసాద్‌రావు మాట్లాడారు. ఎండిపోయిన శ్రీరాములు ఇంద్రజాల ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. అనంతరం నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. విశ్రాంత పీడీ దువ్వూరు సుబ్బలక్ష్మి ఆటలు ఆడించారు.

డైరీని ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

భూ సేకరణ చేయాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - కొవ్వూరు

మండలంలోని వాడపల్లి, మద్దూరు, మద్దూరులంక, సీతంపేట గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలకు అవసరమైన భూమిని సేకరించాలని ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు కలెక్టర్ కీర్తి చేకూరిని కోరారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను అందజేశారు. కొవ్వూరు టౌన్‌లోని లేఅవుట్ ప్రాజెక్టులో ఆయా గ్రామాల ప్రజలకు ఇళ్ల స్థలాలు అందించడానికి 11.68 ఎకరాలు సేకరించారని, కానీ అర్హులైన లబ్ధిదారులు వారిలో ఎక్కువ మంది ఇసుక కార్మికులు అవడం చేత వారు కొవ్వూరు పట్టణానికి వస్తే వారి జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు. అందువల్ల వారు కొవ్వూరు పట్టణంలో కేటాయించిన ఇళ్ల స్థలాలను పొందడానికి ఇష్టపడటం లేదని అందువల్ల లేఅవుట్ ఇప్పటికీ ఖాళీగా ఉందని వివరించారు. ఆ ఖాళీగా ఉన్న స్థలాన్ని కొవ్వూరు పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణం కోసం 5.00 ఎకరాలు, బిసి సంక్షేమ సంస్థ నిర్మాణం కోసం 5.00 ఎకరాలు కేటాయించాలని కోరారు. బంగారంపేట ప్రక్కన వాటర్ గ్రిడ్ కోసం రైతుల దగ్గర నుంచి ల్యాండ్ ఎక్విషన్ కోసం కేటాయించి స్థలాలకు ప్రభుత్వం వాల్యూషన్ ప్రకారం తక్కువ ధర పలుకుతున్న కారణంగా.. రైతులకు గిట్టుబాటు ధర అందించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎఎంసి ఛైర్మన్ నాదేళ్ల శ్రీరాంచౌదరి, ఎంపిపి కాకర్ల నారాయుడు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ సూరపనేని చిన్ని పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంఎల్‌ఎ ముప్పిడి

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

పార్టీ పదవులను పొందిన వారంతా పార్టీ పటిష్టతకు, అభివృద్ధికి కృషి చేయాలని ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని వేలివెన్నులో నిడదవోలు నియోజకవర్గ టిడిపి పట్టణ, మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, వార్డు, బూత్ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తూ ప్రజలకు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. ఆయా కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. నూతనంగా పార్టీ పదవులు పొందిన వారిపై బాధ్యత మరింతగా పెరిగిందన్నారు. అనంతరం పార్టీ పదవులు పొందిన వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాణస్వీకారం చేస్తున్న నాయకులు

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - తాళ్లపూడి

58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయని తాళ్లపూడి శాఖా గ్రంథాలయ అధికారి నరేష్ తెలిపారు. ఈ వారోత్సవాలను పురస్కరించుకొని ప్రతిరోజు గ్రంథాలయంలో వివిధ సాంస్కృతిక, వ్యాసరచన, ముగ్గుల పోటీలు నిర్వహిస్తామన్నారు.

కార్టూ'నిజం'



పోషకాలందించే తేగ... తగ్గేదేలే అంటున్న ధర

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

పోషకాలు పుష్కలంగా ఉండి, సీజనల్‌గా మాత్రమే లభించే తేగలు తెలుగు రాష్ట్రాలతో పాటు, తమిళనాడు ప్రజలకు ఎంతో ఇష్టంగా తింటారు. వాటిలో ఉభయ గోదావరి జిల్లాల తేగలకు డిమాండ్ ఎక్కువ, విక్రయాలు అధికంగా జరుగుతాయి. ఈ సీజన్లో వాటి ధరలకు రెక్కలొచ్చాయి. వర్షాకాలంలో లభించే తాటి టెంకలతో భూమిలో పాతర వేస్తే అక్టోబరు-డిసెంబరు నెలల్లో తేగలుగా ఉత్పత్తి అవుతాయి. ఇవి గ్రామీణ ప్రాంతాల్లో సాంప్రదాయ ఆహారంగా పరిగణిస్తారు. అయితే ఈ మధ్య వాతావరణంలో మార్పులతో ముందుగానే మార్కెట్లో లభ్యమవుతున్నాయి. గతంలో తమ వ్యవసాయ భూముల్లో పండించిన తేగలను ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకునేవారు. ప్రస్తుతం తేగలు వ్యాపార పదార్థంగా మారింది. తేగల వ్యాపారం జీవనాధారంగా మారింది. పాలంగి గ్రామానికి చెందిన తిరుమళ్ళ చంద్రరావు, సీతారత్నం దంపతులు సుమారు 20 ఏళ్లుగా ఉండ్రాజవరం నుంచి తణుకు వెళ్లే రోడ్డు పక్కన అమ్ముకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వారిద్దరితో పాటు మరో ముగ్గురు వారి వద్ద జీవనోపాధి పొందుతున్నట్లు తెలిపారు.

పెరుగుతున్న ధర

లావు పాటి తేగలు ఒక్కొక్కటి గత ఏడాది రూ.10కి విక్రయిస్తే, ఏడాది రూ.15కు విక్రయిస్తున్నారు. 10 తేగలు ఉండే కట్ట రూ.150 మీడియం సైజులో ఉన్న 10 తేగలు రూ.100, సన్నాలు 10 తేగలు రూ.50 అమ్ముతున్నారు. ఒక్కొక్క అంగడి వద్ద రోజుకు రూ.3 వేల నుంచి రూ.6 వేల వరకూ వ్యాపారం జరుగుతుందని వ్యాపారులు చెబుతున్నారు.

ఆరోగ్యానికి ఎంతో మేలు

తేగలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. రోగ నిరోధక శక్తిని పెంచే బి1 థయామిన్, బి2 రిబోఫ్లోవిన్, బి3 రియాసిన్, సి విటమిన్లు అధికంగా ఉంటాయన్నారు. వీటిలో లభించే పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం, ఫాస్పరస్ ఖనిజాలు ఎముకల ధృడత్వానికి, రక్తానికి మేలు చేస్తాయని వివరించారు. తేగలలో దాదాపు 60 శాతానికి పైగా ఉండే పిండి పదార్థాలు, అధిక ఫైబర్ మిశ్రమంతో జీర్ణక్రియకు సహాయ పడుతుందని, తద్వారా మలబద్ధకం, గ్యాస్ సమస్యలు తగ్గుతాయన్నారు.

తేగలను కట్టలు కడుతున్న వ్యాపారులు

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ బత్తుల

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - సీతానగరం

ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని రఘుదేవపురం, చినకొండేపూడి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరితో కలిసి ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించి, దళారుల బెడద లేకుండా నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేయడానికి ఈ కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం ధాన్యం కొనుగోలు చేస్తారని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరగా బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ధాన్యం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, కష్టానికి తగిన ప్రతిఫలం దక్కేలా చూడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ, పౌర సరఫరాల శాఖ అధికారులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

చిట్టూరి చలపతికి పలువురి అభినందన

ప్రజాశక్తి - తాళ్లరేవు

కోరంగి కురంగేశ్వర లయన్స్ క్లబ్ ప్రారంభ అధ్యక్షునిగా ఎన్నికైన చిట్టూరి వెంకట చలపతికి పలువురు అభినందనలు తెలిపారు. సేవా భావం కలిగిన చలపతి లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా ఎన్నికవడం పట్ల జెడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చలపతిని సాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లు శ్రీను, గంటా దిలీప్, బొంతు మోహన్, నందికోళ్ల శ్రీమన్నారాయణ, గీసాల సత్తిబాబు, పిల్లి మణికంఠ, మోర్త రాంబాబు, పిల్లి పరదేశరావు, అనసూరి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

16న శెట్టిబలిజ సంఘం వన సమారాధన

ప్రజాశక్తి - తాళ్లరేవు

కార్తీక మాసం సందర్భంగా ఈ నెల 16న శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన నిర్వహించనున్నట్లు ఆ సంఘం ప్రతినిధిలు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమయ్యే పలు కార్యక్రమాల అనంతరం రాత్రి 8 గంటల నుంచి అన్నదానం నిర్వహిస్తామవి తెలిపారు.

ఎంఆర్‌పి ధరలకే అమ్మాలి

ప్రజాశక్తి - పిఠాపురం

విత్తనాలు, ఎరువుల, పురుగుమందుల డీలర్లు రైతులకు ఎంఆర్‌పి ధరలకే బిల్లుతో అమ్మాలని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు ఎన్.విజయకుమార్ స్పష్టం చేశారు. పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలకు చెందిన విత్తన, ఎరువుల, పురుగు మందుల డీలర్లతో ఆయన గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. డీలర్లు మొలక శాతం నిర్ధారించుకొని రైతులకు బిల్లులతో విత్తనాలు అమ్మాలని, సీజన్లో పంట రికమండేషన్ అనుసరించి రైతులకు యూరియా, ఇతర ఎరువులు అమ్మాలని సూచించారు. అమ్మిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎడిఎ పి.స్వాతి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - సామర్లకోట

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిఐ ఎ.కృష్ణ భగవాన్ అన్నారు. వేట్లపాలెం శివారు దోమాడపాకలులో గురువారం రాత్రి సిఐ కృష్ణభగవాన్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ ప్రజలతో మాట్లాడారు. ఇటీవల సైబర్ నేరాలు పెరిగిపోతున్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. బ్యాంకు ఖాతా నంబర్లు, ఎటిఎం పిన్ నంబర్లు ఎవరికీ ఇవ్వకుండా జాగ్రత్త పడాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ నాయకులు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడే వారికి సముచిత స్థానం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

పార్టీలో కష్టపడే ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందని ఎంఎల్ఎ వరుపుల సత్య ప్రభ అన్నారు. ఒమ్మంగి లక్కీ ఫంక్షన్ హాల్లో గురువారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఎంఎల్ఎ సత్య ప్రభ పాల్గొన్నారు. పార్టీ శ్రేణులతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సంస్థాగత ఎన్నికల్లో 1200 మందితో మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీల సభ్యులతో ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు మెట్ల రమణ బాబు, వెన్నా శివ, కొమ్ముల కన్నబాబు, అమరాది వెంకట్రావు పాల్గొన్నారు.

20 వరకూ గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - కరప, పిఠాపురం

కరప మండలంలోని వేళంగి, కరపలో శాఖా గ్రంథాలయాలలో గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి పాట్నీడి వెంకటరంగయ్య తెలిపారు. ఈ వారోత్సవాలు ఈ నెల 20వ తేదీ వరకూ నిర్వహిస్తారని తెలిపారు. విద్యార్థులకు గ్రూపుల వారీగా వ్యాసరచన, చిత్రలేఖన క్విజ్ వంటి పోటీలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. పిఠాపురం పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వాత్సవాలు జరగనున్నాయని లైబ్రేరియన్ రేపాక వెంకటరాము తెలిపారు.

దిగుబడి దిగులుతో కౌలు రైతులు

ప్రజాశక్తి - పెరవలి

మొంథాన్ తుపాను ప్రభావంతో వరి పంట నాశనం అయింది. చేతికందే సమయంలో వచ్చిన తుపానుతో నేడు రైతులు పంట దిగుబడి పై దిగాలు పడుతున్నారు. మండలంలో సుమారు 8400 ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేశారు. ప్రస్తుతం పిఎల్-1100, పిఆర్-126, 1318,1121 వంటి రకాలను రైతులు సాగు చేశారు. మండలంలోని ఉసులుమర్రు, కానూరు, నడిపల్లి, కానూరు అగ్రహారం గ్రామాల్లో రైతులు యంత్రాలతో వరి కోతలు కోస్తున్నారు. కానూరు,

కోత కోస్తున్న మిషన్

ఉసులుమర్రు గ్రామాల్లో పండిన విత్తన వరి రకం పిఆర్ -126 ఇతర ప్రాంతాల రైతులు వచ్చి కొనుగోలు చేస్తారు. గత వారం రోజులు ధాన్యం కొనుగోలు కేంద్రాల సర్వర్ల మొరాయించడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోత కోసే మిషన్ దారులు రైతుల వద్ద నుంచి ఎకరానికి రూ.2800 వసూలు చేస్తున్నారు. పిఎల్ వరి రకం ఎకరానికి 28 బస్తాల నుంచి 30 బస్తాలు, స్వర్ణ రకం 30 బస్తాలు, విత్తన వరి రకం 1121 ఎకరానికి 30 బస్తాలు దిగుబడి వస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆశించిన స్థాయిలో పంట దిగుబడి లేదని, పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి కన్పించడం లేదని రైతులు వాపోతున్నారు. కౌలు రైతుల పరిస్థితి ధీనంగా మారింది. వచ్చిన పంటను శిస్తుగా ఇచ్చేస్తే మిగిలేది ఏమీ లేకుండా పోతుందని కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి కౌలు రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి

ఖరీఫ్‌లో 20 ఎకరాల్లో కౌలు చేస్తున్నాను. తుపాను ప్రభావంతో పంట దిగుబడి తగ్గిపోయింది. ఎకరానికి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ నష్టం వచ్చింది. కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

-పుల్లా ఆదిశేఖర్, కౌలు రైతు, ఉసులుమర్రు

నా కుటుంబానికి రక్షణ కల్పించండి

విలేకర్ల సమావేశంలో చంద్రాసత్రం మాజీ ఛైర్మర్ రామ్‌శర్మ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, నగర అధ్యక్షుడు మార్గాని భరత్ రామ్ అనుచరుడు పీతా రామకృష్ణ నుంచి తన కుటుంబానికి రక్షణ కల్పించాలని చందాసత్రం మాజీ ఛైర్మన్ రామ్‌శర్మ వేడుకున్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించినన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వృద్ధులైన తన తల్లిదండ్రులను పీతా రామకృష్ణ తమ ఇంటికొచ్చి మరీ వేధిస్తున్నాడని వాపోయారు. ఆయనకి రూ.4 లక్షలు బకాయి ఉన్నాననే కారణంతో ఈ వేధింపులకు దిగుతున్నాడని తెలిపారు. తాను లేని సమయంలో రామకృష్ణ తన ఇంటికి ఒక మహిళతో కలిసి వచ్చి ఉదయం నుంచి రాత్రి వరకు అక్కడే గడిపాడని తెలిపారు. రామకృష్ణ చేష్టలతో తన తల్లిదండ్రులు భయంతో వణుకుతున్నారన్నారు. ఇవన్నీ భరత్‌రామ్‌కు తెలిసినా రామకృష్ణను మందలించట్లేదన్నారు. ఇవన్నీ చూస్తుంటే భరత్ ప్రమేయంతోనే జరుగుతున్నాయనే అనుమానం కలుగుతుందన్నారు. ఇప్పటికే రామకృష్ణపై పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. మాజీ ఎంపీ భరత్ కోసం కష్టపడి పనిచేశానని గుర్తు చేశారు. పేపరుమిల్లు కార్మిక నాయకుడు ప్రవీణ్‌చౌదరి ఇచ్చిన రూ.1.50 కోట్లను మూడు ధఫాలుగా భరత్‌కు తానే స్వయంగా అందించానన్నారు. బుర్రిలంక ఇసుక ర్యాంపు నుంచి నెలకు రూ.25 లక్షలు అందించానన్నారు. కొవ్వూరు ఇసుక ర్యాంపును తనకు కేటాయించడం కోసం భరత్‌కు రూ.25 లక్షలు ఇచ్చానన్నారు. తాను ఐపి పెట్టలేదని, కొంత గడువు ఇస్తే అందరి బకాయిలూ చెల్లిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో న్యాయవాదులు అనిల్, నవీన్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా గిరిజన స్వాభిమాన ఉత్సవాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

బొమ్మూరులోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో గిరిజన స్వాభిమాన ఉత్సవాలు గురువారం ఉత్సాహంగా జరిగాయి. బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గిరిజన సంప్రదాయ వస్త్రధారణలతో విద్యార్థులు నిర్వహించిన ఫ్యాషన్ షో ఆకట్టుకుది. గిరిజన కళారూపాలు, నృత్యాలు, పాటలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కెఎన్.జ్యోతి మాట్లాడుతూ గిరిజన సంస్కృతి సంప్రదాయాల వారసత్వాన్ని యువతకు పరిచయం చేయడం గిరిజన స్వాభిమాన్ ఉత్సవాల ప్రధాన ఉద్దేశ్యమన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నవంబర్ 1 నుంచి 15 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి ఈ నెల 15న రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో జరగనున్న గిరిజన స్వాభిమాన్ ముగింపు ఉత్సవాల్లో బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.ఇందిరా ప్రియదర్శిని, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులతో అధికారులు, ఉపాధ్యాయులు

నాటకాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

గ్రంథాలయ వారోత్సవాలు జరిగేనా..?

ప్రజాశక్తి - చాగల్లు

ఈ నెల 14వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని శాఖా గ్రంథాలయాల్లో గ్రంథాలయ వారోత్సవాలు జరగనున్నాయి. అయితే చాగల్లు శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు జరుగుతాయా? లేవా? అనేది చర్చానీయాంశంగా మారింది. చాగల్లు శాఖా గ్రంథాలయం 1981 సంవత్సరంలో ప్రారంభమైంది. గ్రంథాలయం అభివృద్ధిలో భాగంగా 2018లో ఎంపి మాగంటి మురళీమోహన్ ఎంపీ నిధులు రూ.39 లక్షలతో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి 2019 అక్టోబర్ నెలలో ప్రారంభించారు. నాటి నుంచి పాఠకుల సంఖ్య పెరిగింది. అయితే ఐదు నెలల క్రితం గ్రంథాలయ అధికారి గద్దే శ్రీనివాసరావు నిడదవోలుకు బదిలీ అయ్యారు. నాటి నుంచి నేటి వరకూ ఆయననే ఇన్‌ఛార్జ్‌గా కొనసాగుతున్నారు. అయితే ఆయన కేవలం వారంలో ప్రతీ మంగళవారం మాత్రమే గ్రంథాలయానికి వస్తున్నారు. మిగిలిన రోజుల్లో స్వీపర్ పత్రికల విభాగాన్ని నడిపిస్తున్నారు.

నిరుపయోగంగా ఉన్న గ్రంథాలయం

ఈ నేపథ్యంలో శుక్రవారం నుంచి నిర్వహించే గ్రంథాలయ వారోత్సవాలు జరుగు తాయా? లేవా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. పూర్తి స్థాయి శాఖా గ్రంథాలయ అధికారి లేకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిం దని పాఠకులు చెబుతున్నారు. తక్షణమే పూర్తి స్థాయి గ్రంథాలయ అధికారిని నియమించాలని పాఠకులు డిమాండ్ చేస్తున్నారు.

మల్లవరం రేషన్ దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని మల్లవరం గ్రామంలోని రేషన్ దుకాణాలను తహశీల్దార్ పి.రామకృష్ణ తనిఖీలు నిర్వహించారు. లబ్ధిదారులకు సక్రమంగా సరుకులు అందుతున్నాయా? లేవా? అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రేషన్ దుకాణాలలో ఉన్న స్టాకులను పరిశీలించి, రిజిస్టర్లను తనిఖీ చేశారు. రేషన్ సరుకులకు సంబంధించి అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీలర్లను హెచ్చరించారు.

రేషన్ షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న తహశీల్దార్

కంటి ఆరోగ్యంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

కంటి ఆరోగ్యంపై ప్రతీ ఒక్కరికీ అవగాహన అవసరమని డాక్టర్ హారిక ప్రియంవధ అన్నారు. గురువారం మాక్సివిజన్ కంటి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మైయోపియాపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఉమెన్స్ కళాశాల నుంచి ఎపి అప్పారావు రోడ్డు లోని రామాలయం సెంటర్ వరకూ ర్యాలీ సాగింది. ఈ ర్యాలీని ప్రారంభించిన డాక్టర్ హారిక ప్రియంవధ మాట్లాడుతూ పిల్లలు ఎక్కువ సమయం మొబైల్/స్క్రీన్ ముందు గడపడం, బహిరంగ ఆటలు తగ్గిపోవడం వల్ల మైయోపియా కేసులు పెరుగుతున్నాయని అన్నారు.కంటి ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా పిల్లలకు ఆరు నెలలకు ఒకసారి కంటి పరీక్షలు తప్పనిసరిగా చేయించాలన్నారు. క్లస్టర్ హెడ్ అఖిల్ మాట్లాడుతూ కంటి ఆరోగ్యంపై

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, సిబ్బంది

అవగాహన కార్యక్రమాలను మాక్సివిజన్ నిరంతరంగా కొనసాగిస్తుందని తెలిపారు. 20 సంవత్సరాల లోపు వారికి నవంబర్ 30 వరకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిఎంసి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, రెడ్ క్రాస్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు బళ్ళా శ్రీనివాసరావు మాట్లాడుతూ మాక్సివిజన్ కంటి ఆసుపత్రి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ వైద్యులు, ఆదిత్య కాలేజీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధార్‌కి ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని 20 సచివాలయంలో ప్రతి ఒక్కరు ప్రభుత్వం నుంచి ఏ సంక్షేమ పథకం పొందాలన్నా ఆధార్ అప్‌డేట్ చేయించుకుని ఇకెవైసి చేయించుకోవాలని ఎంపిడిఒ ఎం.గోవింద్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. లబ్ధిదారులు ఆయా గ్రామ సచివాలయాలకు వెళ్లి సిబ్బందితో తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలన్నారు. తద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి రావలసిన పథకాలకు ఎటువంటి ఆటంకం ఉండదన్నారు. కావున ప్రజలు తప్పనిసరిగా ఆధార్‌కు ఇకెవైసి చేయించుకోవాలని ఆయన కోరారు.

మహారాజశ్రీ కాకినాడ 3వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, కాకినాడ

H.M.O.P. No. 27/2025

Between:
కాకరపల్లి నాగలక్ష్మి -పిటీషనర్
మరియు
కాకరపల్లి సతీష్‌కుమార్ -రెస్పాండెంటు

టు:
కాకరపల్లి సతీష్‌కుమార్, S/o. అర్జున్, 26 సం॥లు, ప్రైవేటు ఉద్యోగి, R/o. డో.నెం. 1-29, సింగంపల్లి, రంగంపేట మండలం, కాకినాడ జిల్లా.

పై నెంబరు కేసులో పిటీషనరు తన భార్య అయిన మీపై విడాకులు కోరుతూ పిటీషను దాఖలు చేసియున్నారు. సదరు కేసులో శ్రీ కోర్టు వారి ద్వారా మీకు సమన్లు పంపించిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 24-11-2025వ తేదీన వాయిదా వేసియున్నారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 నిమిషములకు** పై శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కడియాల వి.వి.యస్.యన్.మూర్తి
ఎ.భవాని, బి.రాంబాబు
కె.హిమబిందు, అడ్వకేట్స్, కాకినాడ
సెల్: 9949394515

UMA EDUCATIONAL & TECHNICAL SOCIETY
COLLEGE OF SPECIAL EDUCATION
(Recognized by RCI, New Delhi, Affiliated by Adikavi Nannaya University)
Uma Manovikas Nagar, Vakalapudi, KAKINADA - 533 005.
Ph.No. 0884-3560844, 94912 20349, 94401 19828

ADMISSION INTO B.ED.SE(ID) "B" CATEGORY & "A" CATEGORY SPOT SEATS

Applications are invited from the eligible candidates for B.Ed. Special Education (ID) Course under Management Quota & Spot Admission for the year 2025 - 26.

College Status : Non-Minority
Intake : 30

College Vacancy Position
Category A Left over Seats (Spot) : 3 + 1 (EWS)
Category B Management Quota : 7

Eligibility : Bachelor Degree or P.G with 50% Marks for OC, 40% Marks for BC, SC, ST with or without Ed.Cet - 2025.

Photo Copies : SSC, Intermediate Marks, Degree or PG Marks Lists, O.D.s, Study Certificates and Caste Certificates, TC should be submitted to the college office by Personally between **10.00 A.M. to 4.00 P.M. on or before 15-11-2025.**

- **S.P. Reddy, Executive Director and Correspondent**

మహారాజశ్రీ కాకినాడ 3వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), వారి కోర్టులో

O.S.No. 173/2023

Between :
చిట్టూరి నాగశ్వేత, రిప్రజెంటెడ్ బై జి.పి. హోల్డర్ చిట్టూరి విశ్వనాధస్వామి ...వాది
మరియు
దొమ్మేటి దుర్గారావు ...ప్రతివాది

ప్రతివాది:
దొమ్మేటి దుర్గారావు, S/o. వెంకటేశ్వరరావు, వయస్సు 36 సం॥లు, షాపు నెం.1, డోర్.నెం.69-5-15/ఎ, గైగోలుపాడు, రమణయ్యపేట, కాకినాడ - 533005.

పై నెంబర్ దావాలో మీరు ప్రతివాది అయి ఉన్నారు. సదరు దావాలో శ్రీ కోర్టువారు మీకు ఎన్నిమార్లు సమన్లు పంపినా మీరు తీసుకొనక కాలయావన చేయుచున్నందున మీకు శ్రీ కోర్టువారి ఆర్డర్ ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియచేయునది. సదరు దావాలో మీరు **ది. 17-11-2025 వ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** పై కోర్టువారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీకు సదరు దావాలో ఏమైనా అభ్యంతరములు ఉన్నచో తెలియచేయవలెను. లేనిచో మీ పరోక్షమున సదరు దావాను శ్రీ కోర్టువారు తీర్మానించుదురని తెలియచేయడమైనది.

ముత్తా వెంకన్న, అడ్వకేట్
కాకినాడ,సెల్: 9063829474

మహారాజశ్రీ తుని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఒ.ఎస్.నెం. 194/2025

బిట్వీన్ :
వాది : సరస్వతి రాజాబాబు
మరియు:
ప్రతివాది : సమయమంతుల స్వప్న, భర్త: పెద శ్రీను, డోరు నెం. 7-15-44, ఇసకలపేట, తుని, తుని మండలం, కాకినాడ జిల్లా.

పై నెంబరు దావా యందు శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారంగా ప్రతివాదికి అనేక పర్యాయములు కోర్టు ద్వారాను మరియు పోస్టల్ ద్వారాను సమన్లు పంపియున్నప్పటికిన్నీ, తీసుకొనకుండా తప్పించుకొనుచున్నందున **ది. 28-11-2025వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** పై కోర్టు వారి ముందు వకీలు గారి ద్వారా గాని మీరు స్వయముగా గాని హాజరు కాగలరు. రాని యెడల మీ పై పరోక్షంగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

శ్రీ కోర్టు వారి అనుమతితో
ఎ. విజయలక్ష్మి
అడ్వకేట్, దివాణం వీధి, తుని
తుని సెల్: 9010374668
తే:13-11-2025

మహారాజశ్రీ తుని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఒ.ఎస్.నెం. 202/2025

బిట్వీన్ :
వాది : వాడపర్తి సుబ్బారావు
మరియు:
ప్రతివాది : సమయమంతుల స్వప్న, భర్త: పెద శ్రీను, డోరు నెం. 7-15-44, ఇసకలపేట, తుని, తుని మండలం, కాకినాడ జిల్లా.

పై నెంబరు దావా యందు శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారంగా ప్రతివాదికి అనేక పర్యాయములు కోర్టు ద్వారాను మరియు పోస్టల్ ద్వారాను సమన్లు పంపియున్నప్పటికిన్నీ, తీసుకొనకుండా తప్పించుకొనుచున్నందున **ది. 21-11-2025వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** పై కోర్టు వారి ముందు వకీలు గారి ద్వారా గాని మీరు స్వయముగా గాని హాజరు కాగలరు. రాని యెడల మీ పై పరోక్షంగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

శ్రీ కోర్టు వారి అనుమతితో
ఎ. విజయలక్ష్మి
అడ్వకేట్, దివాణం వీధి, తుని
తుని సెల్: 9010374668
తే:13-11-2025

CHANGE OF NAME

I, **SIDAGAM VEERA VENKATA RAMANA** (new Name), S/o. (Late) Rajarao, resident of D.No.6-45, Basivireddypeta, G.Mamidada, Pedapudi Mandal, Kakinada District - 533 344, Andhra Pradesh. I have changed my name from **SIDAGAM VENKATA RAMANA** alias **VEERA VENKATA RAMANA** (old Name) to **SIDAGAM VEERA VENKATA RAMANA** (new Name). This is for all future purposes.

పేరు మార్పు

నేను, జనిపెల్ల సత్యనారాయణ, S/o. సూర్యారావు, డో.నెం.4-105/14, శ్రీనివాస నగర్, వాకలపూడి, కాకినాడ రూరల్ మండలం, కాకినాడ జిల్లా - 533 005, ఆంధ్రప్రదేశ్, నా యొక్క కుమార్తె **జనిపెల్ల బున్ని** (పాత పేరు)ను **జనిపెల్లి శృతి వనిత** (కొత్త పేరు)గా మార్చుకున్నాము. కావున నా కుమార్తె పేరును అన్ని ప్రయోజనాల నిమిత్తం **జనిపెల్లి శృతి వనిత** (కొత్త పేరు)గా పిలుస్తారు.

పాస్‌పోర్టు పోయినది

తూర్పుగోదావరి జిల్లా, దేవరపల్లి మండలం, రామన్నపాలెం గ్రామ కాపురస్తులైన మంచిలి వెంకన్న, S/o. వీరస్వామి అను నాకు పాస్‌పోర్టు నెంబరు **B 8138956** కలదు. నేను మా ఇంటి దగ్గర నుండి ఆటోలో జిరాక్స్ నిమిత్తం దేవరపల్లి వెళ్ళుచుండగా మార్గం మధ్యలో పడిపోయినది. దొరికినవారు ఈ అడ్రసుకు, ఫోన్ నెంబరుకు తెలియజేయగలరు.

మంచిలి వెంకన్న
S/o. వీరస్వామి
రామన్నపాలెం, దేవరపల్లి మండలం
తూర్పుగోదావరి జిల్లా, పిన్: 534313
సెల్: 9346840025, 9490651162

మహారాజశ్రీ రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. 49/2022 in O.S. 290/2018

Between:
కర్రి మెహర్ శాంతి, W/o. రాజశేఖరరెడ్డి, డో.నెం. 7-19, అర్తమూరు, మండపేట మండలం, కోనసీమ జిల్లా. ...DHr
మరియు
To:
వంక వెంకట్రావు, S/o. సత్యనారాయణ, డో.నెం. 28-2-34, మఠం వీధి, మండపేట (మండలం), కోనసీమ జిల్లా. ...JDr

వేలం నోటీసు

పై నెంబరు E.P., DHr/ వాది మీపై E.P. షెడ్యూల్ ఆస్తి యొక్క విక్రయమునకు గాను మనవి చేసుకునియున్నారు. గనుక విక్రయ ప్రకటన యొక్క షరతులను నిర్ణయించుటకు గాను మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించినప్పటికి మీరు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారు. సదరు E.P. ది. 21-11-2025వ తేదీన వాయిదా అయి ఉన్నది. కావున మీరు **ది. 21-11-2025వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** సదరు కోర్టు నందు హాజరై మీ వాదనను దాఖలు చేసుకోవలెను. అట్లు కాని యెడల మీ పరోక్షమందు సదరు E.P. తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)
శ్రీమతి కె.వి.సత్యవాణి, అడ్వకేటు
రామచంద్రపురం రామచంద్రపురం
ది.12-11-2025 సెల్: 9392756767

IN THE COURT OF THE III ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE, KAKINADA
A.S. No.146 / 2025

Between:
I.Teppala Appa Rao (Died) and 4 Others (Amended as per orders in I.A.No.1795/2023 in O.S.No.740/2018 dt.12-01-2024) ...Appellants
and
Teppala Nagamani and 2 others ...Respondents

Respondents:
1) Teppala Nagamani, W/o Late Srinivas, aged 44 years, Housewife, R/o D.No.62-4-1, J.Ramaraopeta, Jagannaickpur, Kakinada, KJCJ
2) Teppala Hemanth, S/o Late Srinivas, aged 19 years, Student, R/o D.No.62-4-1, J.Ramaraopeta, Jagannaickpur, Kakinada KJCJ
3) Teppala Sahitya, D/o. Late Srinivas, aged 14 years, Student, R/o D.No.62-4-1, J.Ramaraopeta, Jagannaickpur, Kakinada KJCJ (Respondent No.3 is being minor rep by their natural Mother 1st Respondent) i.e.,Teppala Nagamani

I am instructed by Hon'ble III Additional District Judge, Kakinada in the above matter the Respondents i.e., Tappala Nagamani, Tappala Hemanth and Teppala Sahitya being minor rep by her Natural Mother Teppala Nagamani did not choose to receive the Appeal Summons to contest the above mentioned Appeal. The Hon'ble III Addl. District Judge, Kakinada directed the Appellants to give Paper Publication to the Respondents to inform them to appear before this Hon'ble Court on **18-11-2025** at **10.30** AM either by engaging Advocate or personally appear before this Hon'ble Court to contest the matter. Otherwise the above mentioned Appeal i.e., A .S.No. 146/2025 will be heard and necessary will be passed according to Law.

H.VISWANATH, Advocate
G4, Sri Lalitha Heights, #8-23-2, Jammalamadakavari Street, Gandhinagar, Kakinada, Cell: 9866302686

వేలం ప్రకటన

మహారాజశ్రీ 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు :: కాకినాడ
E.P.No.208/2023 in O.S.No.1082/2021

Between:
వెంట్రాప్రగడ వెంకట సత్య గంగాధరరావు...DHr
మరియు
భూర్తి నాగరత్నం ..JDr

పై నెంబరు ఎగ్జిక్యూషన్ పిటిషన్‌లో DHr తన డిక్రీ బాకీని రాబట్టుకొనుటకు గాను JDr తాలూకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ది.**21-11-2025** తేదీన ఉదయం గం॥ **10.30** ని॥ల లగాయితూ పై శ్రీ కోర్టునందు బహిరంగ వేలం జరుగును. సదరు వేలంపాటలో పాడుకొనదలచినవారు వేలపు యిస్తీహార్లు షరతులకు లోబడి పాడుకొనవచ్చును. వివరములకు పై శ్రీకోర్టువారి ఆఫీసు నందు గాని, DHr అడ్వకేటు గారి ఆఫీసు నందు గాని తెలుసుకొనవచ్చును.

షెడ్యూలు: తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ సబ్ రిజిస్ట్రారువారి కార్యాలయ పరిధిలో చేరిన, కరప మండలం, నడకుదురు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన, నడకుదురు గ్రామం తాలూకు సర్వే నెం.97రు దాఖలా 230 చ॥గ॥లు లేక 192.3 చ॥మీ॥లు నివేశన స్థలము అందు డో.నెం.2-218రు గల బంగాళా పెంకుటి ఇంటికి కొలతలు, హద్దుల వివరము: **తూర్పు:** అ.28.0 అం.లు లేక 8.5 మీ.లు - రోడ్డు, **పడమర:** అ.28.0 అం.లు లేక 8.5 మీ.లు - లింగం త్రిమూర్తులు గారి స్థలం, **దక్షిణం:** అ.74.0 అం.లు లేక 22.5 మీ.లు - సందు మార్గం, **ఉత్తరం:** అ.74.0 అం.లు లేక 22.5 మీ.లు - సందు మార్గం. సదరు హద్దుల మధ్యస్థమైన 230 చ॥గ॥లు స్థలము అందు ఎసెస్‌మెంట్ నెం.299, డో.నెం.2-218రు గల బంగాళా పెంకుటి యిల్లు, సమస్త యీజిమెంటు హక్కులతో సహా.

DHr Value: Rs.10,00,000/-
Amin's Value: Rs.35,00,000/-, JDr Value: Not given

పప్పు పాపిరెడ్డి, అడ్వకేటు
డో.నెం.31-1-27, రంగయ్యనాయుడు వీధి
సూర్యనారాయణపురం, కాకినాడ, సెల్: 9182605678

వేలం ప్రకటన

మహారాజశ్రీ రాజమహేంద్రవరం 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. No. 2 of 2023
O.S. No. 392 of 2016

Between:
బొల్లు అనే కోమలి నాగ రాజ్యలక్ష్మి, భర్త: రామకృష్ణ, వయస్సు 35, ఇంటి నంబరు: 8-152, కొంతమూరు గ్రామం, రాజమహేంద్రవరం రూరల్. ...D.Hr
AND
1. కర్రి సత్యనారాయణ, తండ్రి: తాతబ్బాయి, వయస్సు 56, ఉద్యోగి, ఇంటి నంబరు: 3-23, 3వ వార్డు, గోకవరం.
2. కర్రి శివకుమార్, తండ్రి: సత్యనారాయణ, వయస్సు 32, ఇంటి నంబరు: 3-23, 3వ వార్డు, గోకవరం. ...J.Drs

పై నంబరు Execution గ్రంథంలో డిక్రీ హోల్డర్ తన డిక్రీ బాకీ నిమిత్తం Judgement Debtors యొక్క షెడ్యూల్ ఆస్తిని వేలం వేసి డిక్రీ బాకీ రాబట్టుటకు గాను శ్రీ కోర్టు వారు **ది. 27-11-2025వ తేదీ వాయిదా వేసియున్నారు.** కావున సదరు వేలంలో పాడుకొనదలచినవారు పై కోర్టులో DHr గార్ని గాని, పై కోర్టు వారిని గాని సంప్రపదించవలెను.

వేలం తేదీ: 27-11-2025

షెడ్యూలు

తూర్పుగోదావరి జిల్లా, కోరుకొండ సబ్ రిజిష్ట్రి, గోకవరం మండలం, గోకవరం గ్రామం, 3వ వార్డు, ఎస్.నెం. 273, టెర్రస్ బిల్డింగ్ డో.నెం. 3-73 in an extent of 294 sq.yards = 246.96 sq.meters కి హద్దులు.

తూర్పు: రాజ వీధి - 63'. **దక్షిణం:** సైట్ ఆఫ్ వాకాడ రాములు - 42'. **పడమర:** ల్యాండ్ ఆఫ్ రేవడ అక్కయమ్మ - 63'. **ఉత్తరం:** సైట్ ఆఫ్ తాళ్లూరి సుధాకర్ - 42'.

DHR విలువ: రూ.8,00,000/-
అమీనా విలువ : రూ.30,00,000/-
మార్కెట్ విలువ రూ. 9,82,000/-
JDR విలువ : ఇవ్వలేదు

(శ్రీ కోర్టు వారి అనుమతితో)
ఎస్.కుమార్, అడ్వకేట్
రాజమండ్రి శ్యామలానగర్
ది.13-11-2025 రాజమండ్రి

ప్రకటన

నాక్లయింటు అయిన తూర్పుగోదావరి జిల్లా, రామచంద్రరావుపేట, డోర్‌నెం.18-10-6/2, రాజమహేంద్రవరం కాపురస్తులు అయిన **వేములూరి వీరబ్రహ్మంగారి భార్య వేములూరి రామలక్ష్మి** గారు ఇచ్చిన సంజాయిషిపై యావన్మందికి తెలియ జేయునది ఏమనగా

ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి తూ॥గో॥జిల్లా, శ్రీరామ్‌నగర్, L.B. శాస్త్రిరోడ్డు, డోర్‌నెం. 16-2-2/1 ప్రస్తుత డోర్‌నెం.16-3-3/1 వార్డ్‌నెం.41, శ్రీరామ్ నగర్ రాజమండ్రి కాపురస్తులయిన **కోమలి(లేటు) రామస్వామి (రాము) గారి భార్య కోమలి రాజేశ్వరి వీరి కుమారుడు కుమార్తె 2. కోమలి లోకేష్, 3. కోమలి భాగ్యలక్ష్మి, వారి ఆస్తి దస్తావేజు నెం. 3924/2016 ది.2-04-2016 SRO రాజమండ్రి** లోగల ఆస్తి వారిది అయి ఉన్నదని అందువలన మా క్లయింటు క్రయ అగ్రిమెంటు వ్రాయించుకొని యున్నారు. కావునా ఈక్రింది షెడ్యూల్ ఆస్తిపై ఎవరికైనా అప్పులుగాని వారసత్వహక్కులు గాని కోర్టుకేసులు గాని క్రయ అగ్రిమెంట్‌లు గాని బ్యాంక్ లోన్‌లు గాని ఏవిధమైన అభ్యంతరములు ఉన్న యెడల **15 రోజులలో** ఈక్రింది తెలిపిన నాక్లయింట్‌కు గాని నాకు గానితెలియజేయవలసిందిగా కోరుచున్నాను. 15 రోజుల తరువాత వచ్చు ఎవిధమైన అభ్యంతరములు నాక్లయింటును బైండ్ చేయవని మరియు నాక్లయింటు నిర్వివధ నిష్పేచీ ఆస్తి అని నాక్లయింటు కొనుగోలు చేయుదురని తెలియజేయడమైనది.

షెడ్యూలు:- తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం జిల్లా రిజిస్ట్రారువారి ఆఫీసులో చేరిన, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్లో చేరిన, రాజమహేంద్రవరం, 10వ వార్డు,(ప్రస్తుత వార్డు నెం.41) శ్రీరామ్‌నగర్ లో గల టి.యస్.నెం. 30పార్టు దాఖలా డోర్ నెం. 16-3-3/1 & 16-3-3/2ర్లు గల ఆస్తిలో ఉత్తరంవైపు ప్రస్తుత భుక్తప్రకారం ఏకప్రతిగా గల చ॥గ॥ 162-50లు స్తలములో గల డోర్ నెం. 16-3-3/1రు గల రేకుల పైకప్పుతో ఉన్న మేడయిల్లు, స్తలము వగైరాలు యిందుకు **హద్దులు :- తూర్పు** : అ.22-6 లు యీ ఆస్తి తాలుకు ప్రహరీగోడను చేరి యితరుల బిల్డింగ్. **దక్షిణం** : అ.65-0 లు I.T.U వారి ఆఫీసు **పడమర** :అ.22-6 లు రోడ్డు **ఉత్తరం:** అ.65-00 T.N.T.U.C. వారి బిల్డింగ్ యీ హద్దుల మధ్య చ॥గ॥ 162.50ల్కు చ.మీ.135.86 ర్లు స్తలమున్నూ అందలి తలుపులు ద్వారబంధములు, కిటికీలు, అలమార్లు వగైరా పైకప్పుతోవున్న మేడ యిల్లు వగైరా యావత్తు యీజిమెంట్ హక్కులతో సహా నాక్లయింట్ సెల్ నెం.9347122869

ఎ.ఏడుకొండలు,
అడ్వకేట్,ఆర్యాపురం,
రాజమహేంద్రవరం
సెల్.9849446976